# నిరీక్షణ

కాళ్ళుచాపుకొని కూర్చుంది రుక్కమ్మ. బయట సన్నగా జల్లు పడుతోంది... 'చిటపట చినుకులు పడుతూవుంటే...' పక్కూర్లో చూసిన పాత సినిమాలోని పాట జ్ఞాపకమొచ్చింది... బావ.. బావ... బావ... అనేకసార్లు పలువరించినట్లనుకుంది... ఆమె మనసునిండా బావే.. తెల్లని పంచెకట్టు, బుష్షర్టు తొడుక్కొని కోరమీసాలతో వుండే బావరూపం ఆమె కళ్ళముందు కదిలింది... ఆమె ముఖంలో మందహాసం.. మళ్ళీ అంతలోనే విచారం... గుండె నిండా బావ గురించిన ఆలోచనలే.... అయిదారు నెలల క్రితమే రావాల్సిన బావ ఇంకా రాలేదు... బావెందుకురాలేదోనని ఆమెగుండెలు గుబగుబలాడుతున్నాయి... బావెందుకు రావడం లేదు...? - అని పదేపదే ప్రశ్నించుకుంది.

ఏడాదిన్నరక్రితం భీవండి పోయిన బావ ఎండాకాలం వచ్చి పెళ్ళి చేసుకుంటానన్న బావ... ఎండాకాలం పోయి వానాకాలం సగం గడుస్తున్నా రాలేదు .. ఏమయింది బావకు? బాగానే ఉన్నట్టు ఉత్తరాలొస్తున్నా బావే తొందరగా వస్తే బాగుండేది... తానేమన్నా మేడలు మిద్దెలు కోరిందా...? బంగారు నగలు కోరిందా...? తనకోసమింకా సంపాదించడానికాలస్యం చేయడమెందుకు....? తాను ఉన్న దాంతోనే సంతృప్తి పడదామంది... రెక్కల కష్టం చేసుకొని కలిసి బతుకుదామంది. కాని బావ... తనకోసం, తనను సుఖపెట్టడం కోసం డబ్బు సంపాదించడానికి మరింత ఆలస్యం చేస్తున్నాడు.. డబ్బెవరికాక్కావాలి...? బావుంటేచాలు, బావ- అనురాగముంటేచాలు- తాను బావకౌగిట్లో ఎప్పుడొదిగిపోతుంది...?!

ఆలోచిస్తూనే వుంది రుక్కమ్మ. పైనుంచి చినుకులు టప్‌టప్‌మని తలపై పడుతున్నాయి. పక్కకు ఒరిగి కూర్చుంది.

కిష్టయ్యబావ రానియ్యి.. అతన్తో మాట్లాడొద్దు- ఏడిపించాలి... అతని కంటికే కనపడొద్దు... వెదికి వెదికి అలసిపోవాలి! కాని... బావ వచ్చాడంటే తన కాలు నిలస్తుందా? చూడకుండా ఒక్కక్షణమైనా ఉండగలదా? ఎక్కడున్నా, ఏ పనిలోవున్నా అతడొచ్చాడని తెలిస్తే ఉన్నదున్నట్టు వదిలి అతని ముందు వాలిపోకుండా ఉండగలదా? అతనికి దూరంగా ఉండటం తనకు సాధ్యమవుతుందా...? అతని మాటే తనకు మంత్రంలాంటిది... అతని మాట వినబడితే తాను నిలువగలదా? నాగస్వరం విన్న పాములా పరుగెత్తుకొనిపోదా? అతని అడుగుల సవ్వడి దూరంనుంచైనా గుర్తుపడుతుంది. అలాంటప్పుడు బావ వచ్చాడని తెలిస్తే... కంటబడితే అతని దగ్గరకు చేరకుండా దూరంగా ఉండటం సాధ్యం కాదన్నమాట

నిజం! కాని.. ఈసారి తప్పకుండా దూరంగా ఉండాలి... బావనేడ్పించాలి... తనను మరచియిన్ని రోజులున్న బావనొక్కసారైనా ఏడ్పించాలి.

అయితే బావ మాత్రం తనకు దూరంగా ఉండగలడా...? ఊళ్ళో కడుగుపెట్టిన మరుక్షణంలోనే తనముందు వాలిపోడూ? అతనికి మాత్రం తనుచూడకుండా ఉండటంసాధ్యమవుతుందా? మరి వస్తానన్న బావ సమయానికి రావడంలేదెందుకు? ఏదేమైనా సరే.. ఈ సారి బావనేడ్పించితీగాలి.

రకరకాలుగా ఆలోచిస్తూంది రుక్కమ్మ... తన చిన్నతనంలో ఓసారి తండ్రితో భీవండి వెళ్ళి కొద్దిరోజులుండి అక్కడి జీవితాల్ని చూసింది. చాపంత వెడల్పయినాలేని స్థలంలోనే వండుకోవడం, పడుకోవడం సర్వం. అంత ఇరుకు స్థలంలో బావెలా గడుపుతున్నాడో...!. అక్కడ మన తిండికాదు - ఇక్కడ వరన్నమో, జొన్నన్నమో కడుపునిండా తినేబావ ఆ రొట్టెతిని ఎలా ఉంటున్నాడో...! అక్కడ మన భాషకాదు... మరాటిభాష.. మన మనుషులు కారు... మన బతుకు కాదు- వాళ్ళమధ్య బావెలా కాలం గడుపుతున్నాడో...!

కిష్టయ్యను గురించిన ఆలోచనలతో ఆమె దుఃఖం ఆగలేదు. కొంగుతోకన్నీళ్ళు తుడుచుకుంది రుక్కమ్మ. తాము బాకీల్లేకుండా బతకడానికి, తననుసుఖపెట్టడానికి డబ్బు సంపాదించుకొస్తానని పోయిన బావ కొరకు తానెందుకు దుఃఖించాలి?... బావ ఈరోజు కాకుంటే రేపొస్తాడు... తనకు తానే సమాధాన పర్చుకుంది.

రాత్రింబవళ్ళు ఆ మరమగ్గాలపై పనిచేస్తూ బావెంత కష్టపడుతున్నాడో..?? తనను సుఖపెట్టడంకోసం డబ్బు సంపాదించుకురావడానికి దేశంగాని దేశంపోయిన బావ విశ్రాంతి లేకుండా పనిచేస్తూ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నాడేమో...?

అంతులేని ఆలోచనలతో రుక్కమ్మ హృదయం బరువెక్కింది.

ఏడాదిన్నరక్రితం భీవండి వెళ్ళిన కిష్టయ్య కోసం ఆ మరునాటినుంచే ఎదురుచూస్తూంది రుక్కమ్మ. బావ రాకకోసం కళ్ళల్లో వత్తులేసుకొని నిరీక్షిస్తోంది... రోజూ పక్కనే ఉన్న అత్తింటికెళ్ళి బావ నుంచి ఉత్తరమొచ్చిందా అని అడుగుతోంది... వస్తే తనను గురించి ఉత్తరంలో ఏమైనా రాసాడా అనీ, బావెందుకు రావడంలేదని నిష్ఠూరంగా అడుగుతుంది... మేనత్త రుక్కమ్మ ఆతురతకు నవ్వుకొని కోడల్ని మరింత ఉడికించడానికి ప్రయత్నం చేస్తుంటుంది... అత్తనే కాకుండా భీవండి నుంచి తిరిగొచ్చిన వాళ్ళతోబావ గురించి ప్రశ్నిస్తుంది. బావేమన్నాడని అడుగుతుంది... ఎలా ఉన్నాడని గుచ్చిగుచ్చి అడుగుతుంది... ఎప్పుడొస్తానన్నాడని ప్రశ్నలమీద ప్రశ్నల వర్షం కురిపిస్తుంది. భీవండికి పోయేవాళ్ళతో ఎన్నో కబుర్లు చెబుతుంది. బావనడిగాననీ, తనను మరచిపోవద్దనీ, ఆరోగ్యం పాడుచేసుకోవద్దనీ చెప్పమంటుంది. చివరగా త్వరగారమ్మని చెప్పి పంపుతుంది.

చిన్నప్పుడు తానెందుకు చదువుకోలేదా అని రుక్కమ్మిప్పుడు బాధపడుతోంది. తనను చదివించని తల్లిదండ్రులను మనసులోనే తిట్టుకుంటోంది. తాను చదువుకుంటే బావకు లేఖలు రాసేది. ఎందరితో ఎన్ని చెప్పి పంపినా బావతో మాత్రమే చెప్పేవి ఎన్నో కబుర్లు ఇంకా మిగిలిపోతూనే వున్నాయి... బావ చదివినాల్గవ తరగతి చదువుతో వచ్చిరాని భాషలో అత్తకు ఉత్తరం ముక్క రాస్తున్నందుకు గొప్పగా భావిస్తుంది తాను. తనకు చదువొస్తేతానుబావకు, బావ తనకు ఉత్తరాలు రాసుకునేవారు.

తాను 'తూర్పువెళ్ళే రైలు' సినిమా చూసింది. ప్రియుడి రాకకోసం ఆ పిల్లపడే తపన చూసింది.

తన బావకు కాకితోనైనాసరేకబురంపాలని, మేఘంతోనైనా సరేసందేశం పంపాలని మూగగా ఆలోచిస్తోంది రుక్కమ్మ. ఆమె మేఘసందేశంలోని నాయికయ్యై, అభిసారికయ్యై కిష్టయ్య రాకకోసం అలా ఎదురు చూస్తూనేవుంది....

చూసీ చూసీ ఆమె కళ్ళు కాయలు కాస్తున్నాయి. ఇంట్లో ఉన్నా, పనిలోకెళ్ళినా, తింటున్నా, పడుకుంటున్నా ఆమెకతని ధ్యాసే... కళ్ళముందతని రూపమే... జాతరలో బావకొనిచ్చిన ఉంగరం కంకణంగా అశోకవనంలో సీతమ్మలా, దుష్యంతుడి రాకకై నిరీక్షించే శకుంతలలా ఎదురుచూస్తూనే వుంది రుక్కమ్మ.

ఎందరితో కబురంపినా రాకుండా ఇప్పుడొస్తా, అప్పుడొస్తానంటూ ఆలస్యం చేస్తున్న బావపై కోపంగానూ, వెంటనే ప్రేమగానూ వుంటోందామె.

బావ గురించి ఆలోచనలోపడ్డ రుక్కమ్మ కళ్ళముందు ఎన్నో తియ్యని స్మృతులు... జ్ఞాపకాల దొంతరలు చిన్నప్పట్నుంచితాను బావతో గడిపిన మధుర క్షణాలు... ఆటలు...పాటలు.. కేరింతలు,... చిలిపి పనులు.. గిల్లికజ్జాలు... అనురాగాలు... ఆప్యాయతలు... తెరపై బొమ్మల్లా కదిలి ఆమె మనస్సు గతంలోకి పరుగెత్తింది.

★★★

కిష్టయ్య తల్లి రాజమ్మ, రుక్కమ్మ తండ్రి అక్కాతమ్ముళ్ళు. ఇద్దరిళ్లు పక్కపక్కనే.. రెండిళ్ళమధ్య వుండే చిన్న గోడెప్పుడో కూలిపోయింది. చిన్నపిల్లలు కూడా అటూ ఇటూ తిరగడానికా రెండిళ్లమధ్య ఇప్పుడే అడ్డంకులూ లేవు. కిష్టయ్య రుక్కమ్మకంటె రెండేళ్లు ముందు పుట్టాడు. రుక్కమ్మతల్లి గర్భవతికాగానే ఆడపిల్లనే కనాలనేది. రాజమ్మరుక్కమ్మతల్లి కడుపులో ఉన్నప్పుడేకిష్టయ్యకు పెళ్లామొస్తుందనుకునేవారు. రుక్కమ్మ పుట్టగానే కిష్టయ్యకు పెళ్ళాం పుట్టిందన్నారు. కిష్టయ్య పెద్దలు చెప్పినమాటలు విని ముద్దుముద్దుగా వచ్చీరాని మాటల్లో 'నాకు పెళ్ళాం పుట్టింది...' అనేవాడు రుక్కమ్మ పడుకున్న మంచం దగ్గరికొచ్చి.

బావామరదళ్లిద్దరూ ఒకే ఇంటివాళ్లలా పెరిగారు. ఒకర్ని చూడందే మరొకరుండేవారు కారు. ఒకరింట్లో చేసిన జంతికలు, గారెలు, లడ్డూలలాంటివి మరొకరింటికెళ్లేవి. ఒకరివ్వంది మరొకరు తినేవారు కాదు. కలిసి దాగుడుమూతలాడుకునేవారు. తొక్కుడు బిళ్లాట ఆడుకునేవారు. అప్పుడప్పుడు పోట్లాడుకునేవారు. ఒకర్నొకరు ఏడిపించుకునేవారు. మళ్ళీ కొద్దిసేపట్లోనే కలిసిపోయేవారు. వాళ్ల బాల్యం అన్యోన్యంగా ప్రేమానురాగాలతో గడిచిపోతోంది.

బడికివెళుతున్న కిష్టయ్య ఇంట్లో ఆర్థిక పరిస్థితిసరిగా లేనందువల్ల నాల్గవ తరగతి తర్వాత చదువాపవలసి వచ్చింది. తండ్రికితోడుగా నేతపనిలో సాయం చేసేవాడు. ఆడపిల్లకు చదువెందుకులే అని రుక్కమ్మను ఆ మాత్రం కూడా చదివించలేదు. ముద్దుముద్దుగా బాల్యంగడిచి ఇద్దరూ యవ్వనంలో అడుగు పెడుతున్నారు. వయసుతోపాటు ఒకరంటే మరొకరిపై ఆప్యాయానురాగాలూ మరింత పెరుగుతున్నాయి. ఈలోగా షోలాపూర్‌లో వుండే రుక్కమ్మ తండ్రి చనిపోయాడు. రుక్కమ్మ తల్లి, రుక్కమ్మ ఇద్దరూ వ్యవసాయ కూలిపనులు చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. కిష్టయ్య మగ్గం నేస్తూ బట్టలమ్ముకుంటూ జీవిస్తున్నాడు. రుక్కమ్మ, కిష్టయ్య ఇద్దరూ యుక్తవయస్కులైనా తల్లిదండ్రులు వాళ్ళ పెళ్లి చేయాలనుకుంటూనే ఎన్నో కారణాలవల్ల చేయలేకపోయారు. వాళ్లిద్దరిప్పుడు ఓరచూపులతో, దొంగచూపులతో ఒకర్నొకరు చూసుకుంటున్నారు. ఇంట్లో పెద్దలు లేని సమయంచూసి ఎన్నో కబుర్లు

చెప్పుకుంటున్నారు. పెళ్లికొరకెదురు చూస్తున్నారు.

ఒకరోజు వాకిట్లో రెండు కట్టెలమధ్య కట్టబడిన నూలును బట్టసేయడానికి తయారు చేయడానికై 'షరి'చేస్తున్నాడు కిష్టయ్య. రుక్కమ్మ ఇంట్లోంచి ఆమె తల్లిబయటకుపోవడంచూశాడు.

''ఏయ్ రుక్కు, ఇట్రా'' పిలిచాడు...

రుక్కమ్మ మాట్లాడలేదు.

''ఇట్రమ్మంటే...'' గట్టిగా అన్నాడు కిష్టయ్య.

''నేనురానుపో...'' అంది నీళ్ల చేదుతూ రుక్కమ్మ.

''నేనే రావాల్నా మరి?''

''నాతో నీకేం పని?''

''ఎం పనో చెప్పుత... వత్తన్న''

''అక్కడ పనాగిపోతే అత్తమ్మ తిడుతది...''

'' ఆల్లింట్ల ఏంలేరు తియ్యవోయ్..'' అని కుంచె నేలపైపెట్టి రుక్కమ్మ దగ్గరికెళ్లాడు. నీళ్ళుచేదినిల్చున్న రుక్కమ్మ చేయిపట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆమె చేతులు తీసుకొని చెంపకు రాసుకున్నడు. తన చేతులతో ఆమెచెంపలు రాశాడు.

'' ఎవ్వలన్న సూత్తే మంచిగుండదు... లే..'' అంది రుక్కమ్మ.

''అంటే ఎవ్వల్జూడకుంటే బాగనే ఉంటదంతేనా?'' అని ముద్దుపెట్టుకున్నాడు.

''పో బావ...'' అని సిగ్గుల మొగ్గయింది. రుక్కమ్మ. రుక్కమ్మ తల్లి వస్తున్న అడుగుల చప్పుడు విని ఆమెనొదిలి గబగబా వెళ్లి తన పనిలో నిమగ్నుడయ్యాడు కిష్టయ్య.

ఆ దృశ్యం జ్ఞాపకానికొచ్చి తన చేతులను ముద్దుపెట్టుకుంది రుక్కమ్మ.

ఇంకోరోజు. బయట చల్లగాలి. అత్తతో మాట్లాడదామని ఇంట్లోకెళ్ళింది రుక్కమ్మ. రాజమ్మ ఊళ్లోకి పనిమీద వెళ్లింది. ఇంట్లోబావొక్కడే ఉన్నాడు. ఇంట్లో కొచ్చిన రుక్కమ్మ కొంగు పట్టుకున్నాడు కిష్టయ్య.

''ఛీ... ఇడువు బావా!'' అంది దగ్గరకు జరుగుతూనే రుక్కమ్మ.

''విడుత్తానుండు...'' అని కొంగు వదిలికౌగిట్లోకి చేర్చుకున్నాడు. బావస్పర్శలో ఎంతో ఆనందం... శరీరంలో విద్యుత్ ప్రవహిస్తున్న అనుభూతి... ఆ కౌగిలి అలాగే శాశ్వతంగా ఉండిపోతే బాగుండునన్న ఆశ...

కాని తాము అవివాహితులు... ఎంత బావా మరదలైనా, కాబోయే భార్యాభర్తలయినా పెళ్లి కాకముందు హద్దులు మీరితే...! బావ కౌగిలెంత తీపిగావున్నా వదిలించుకుంది రుక్కమ్మ.

''బావా! మనకింకా లగ్గం కాలేదు... లగ్గం గాకముందు ఇటువంటి పనులొద్దు...'' అని దూరం జరిగింది.

''ఇయ్యాల్లగాకుంటే రేపయిన మనం ఆలుమగలమేనాయె...'' అని మళ్లీ దగ్గరకొచ్చాడు కిష్టయ్య.

''గా మూడుముళ్లు పడేదాక మనం దూరమే ఉందాంలే బావా..'' అని బావను వదిలి వెళ్లిపోవడం ఇష్టం లేకున్నా ఇంటికెళ్లిపోయింది.

బావకౌగిట్లో బంధించబడినట్టు కళ్లముందు కదలగారుక్కమ్మ ఒళ్లు పులకరించింది... నిట్టూర్పు

విడిచింది?

---

ఇంకోసారి కలుపుతీయడానికి కూలికెళ్లి ఇంటికి తిరిగొస్తోంది రుక్కమ్మ... ఏదో పనిమీద పక్కూరెల్లి ఇంటికొస్తున్న కిష్టయ్య ఆమెను కలుసుకున్నాడు. జల్లుగా కురుస్తున్న వర్షం వాళ్లిద్దర్నీ తడిపేసింది. వర్షంలో పూర్తిగా తడిసిన బట్టల్లోంచి రుక్కమ్మ ఒంటి వంపుసొంపులన్నీ తనివితీరా చూస్తూ పక్కనే నడుస్తున్నాడు కిష్టయ్య. ఆమె చేతిని తనచేతిలోకి తీసుకొన్నాడు మరదలుస్పర్శతో కిష్టయ్య ఒళ్లు జ్వరపీడితుడిలా కాలిపోయింది. రుక్కమ్మ చేతిని గట్టిగా నొక్కాడు.

వర్షం కురియడం ఎక్కువకావడంతో ఇద్దరూ ఓ చెట్టుకింద నిల్చున్నారు.

''బావా! మన లగ్గమెప్పుడు?'' ప్రశ్నించింది రుక్కమ్మ.

''ఇప్పుడు మంచిదినాల్లెవ్వట... మాగమాసంల సేత్తరట..'' అని ''రుక్కూ... మనమెన్ని రోజులని ఒకర్నిచూస్తూ ఒకరం గడపడం...'' అని కౌగిట్లోకి తీసుకున్నాడు. బావ కౌగిట్లో గువ్వలా ఒదిగిపోయింది రుక్కమ్మ. బావచేతులు రుక్కమ్మ శరీరాన్ని ఎక్కడెక్కడో తడుముతున్నాయి... ఎంతో హాయిగా, ఆనందంగా స్వర్గంలో విహరిస్తున్నట్టుగా వుందామెకు. కాని తన స్థితిని జ్ఞాపకం చేసుకొని మెల్లగా బావ కౌగిలిని విడిపించుకుంది.

''బావా... ఇంకో ఐదారునెల్లు మనం దూరముండాలె... తప్పదిమరి... అటెనుక నేను నీదాన్నేనాయె...'' అంది.

''అంటే, ఇగ అప్పట్నుంచి ఇదే పనన్నమాట... అంతేనా'' అని రుక్కమ్మ చెంపగిల్లాడు.

''ఛీ... పో అన్నీపాడుమాటలే...'' అంది సిగ్గుపడుతూ రుక్కమ్మ.

ఆ వానలో ఎవరికివారే తామెరిగినసినిమా డ్యూయెట్లు లోపల్లోపలే పాడుకుంటూ ఇంటికి చేరుకున్నారు.

ఆనాటి బావస్పర్శ జ్ఞాపమొచ్చి తనలో తానే ముసిముసిగా నవ్వుకుంది...

మాఘమాసం వచ్చింది. వాళ్ల పెళ్లిచేద్దామనుకునేంతలో కిష్టయ్య తండ్రి చనిపోయాడు. వాళ్ల బాధ వర్ణనాతీతం... సంవత్సరీకాలు అయ్యేవరకు ఇంట్లో పెళ్ళి చేయకూడదని పెద్దలమాట. కాలం మరో సంవత్సరం వాళ్లకు ఎడబాటు కల్గించింది. రోజుకో యుగంగా గడుపుతూ ఇద్దరూ ఎదురుచూడసాగారు, సంవత్సరీకాలు కూడా ఈ మధ్యనే అయిపోయాయి. ఇక బావతో తన ఎడబాటు తప్పుతుందని, తాము కలిసిమెలసి బతుకొచ్చని కలలుగంటూ పెళ్లి ముహూర్తం కొరకు ఎదురుచూస్తోంది రుక్కమ్మ.

రుక్కమ్మకెదురుగా నులకమంచంలో కూర్చున్న కిష్టయ్య ముఖంలో విచారం. ఏదో పెన్నిదిని కోల్పోయిన భావం... బావ ముఖంలో విచారం రుక్కమ్మకు బాధ కల్గించింది. బావ తండ్రి గూర్చి విచారిస్తున్నాడనుకొని ''బావా! ఆయుసుగూడినంక ఎవ్వలైన పోయెటోళ్లే... మామ మన తలువాలు పడెదాకున్నా మంచిగుండేది...'' అన్నాడు విచారంగా.

''బావా! నేనిట్లంటన్నని ఏమనుకోకు, ఊళ్లోళ్ళంతా మనలననుమానంగ జూత్తుండ్రు... యాడాద్దినమయి పాయె...గా అయ్యగార్నడిగి మంచిది నాలెప్పుడున్నయో అడిగిరాలేవు. మా అవ్వేమొపిచ్చిది. దానికేం దెలువది...''

''రుక్కూ! నేను లగ్గం గురించే అలోసిత్తన్న... కని నాయన సచ్చిపోయినంక ఇల్లు దెబ్బతింది. ఇద్దరం సేత్తేనే అట్లట్ల గడిసేది... మగ్గం నేసుకుంట బట్టలమ్మితె పొట్టగడుసుడే కట్టమయితంది. గిటువంటప్పుడు లగ్గం జేసుకుంటెట్ల సెప్పు...'' అన్నాడు తలవంచుకొని.

కిష్టయ్య మాటలు రుక్కమ్మకు బాధ కల్గించాయి. తనను బాప పరాయిదానిగా భావిస్తున్నాడా?

''గద్వేం మాటలు బావ? మనకు మునుపట్నుంచి మాత్తరం పెద్దలు సంపాయించి పెట్టిన ఆస్తిపాస్తులున్నాయా...? మడిమాన్నాలున్నయా..? కూసుండి తినెటోల్లు నువ్వన్నట్టాలో సించాలె... ఇద్దరం సెరో కట్టం సేనుకున్న మంటె అదే పొట్ట గడుత్తది...'' అంది రుక్కమ్మ...

''నువ్వన్నది నిజమే రుక్కూ! నేను ఇప్పుడు పొట్టగడుసుడుగురించి మాట్లాడతలేను... ఇన్రోజులెంతజేసినా ఆడికాడికి పొట్టకెల్లింది... నాయన దినాలకు, యాడాద్దినానికి అప్పయింది. ఇక్కన్నేవుంటె ఆ బాకికి వడ్డీ పెరుగుతది. అటెనుక తీర్సుడు కట్టమయితది. అవ్వ కేమొ పురాగ సాతగాకుంటయింది...'' అన్నాడు కిష్టయ్య.

''అయితే ఏంజేత్తనంటవు బావ...?''

''భీవండి పోయి ఓ యాడాదుండొత్త... నెలకు నూరిన్నూరు ఎనకేసినా బాకీ తీరుతది... అటెనుక లగ్గం జేసుకోవచ్చు...'' తన అభిప్రాయం చెప్పాడు.

బావ మాటలతో తలపై పిడుగుపడ్డట్టయింది రుక్కమ్మకు. మరో ఏడాది ఎడబాటు భరించడం అంటే మాటలుకాదుగదా!

''లగ్గం జేసుకొని ఇద్దరం పోదాం, పా...నేంగూడ అక్కడేమన్న పన్జేత్త...'' అంది.

''రుక్కూ! అక్కడి సంగతి నీకు తెలువందే ముంది సెప్పు? ఒక్కొక్క అర్ర (గది)ల నలుగురైదుగురుండాలె... మనిషికి సాపెలుపు జాగన్న రాదు, నడుమొక్క పరుదుంటది. పరుద లేవడితె అంత బయిరంగమేనాయె... కొత్తగ లగ్గంజేసుకొని గక్కడుండుడెట్ల సెప్పు...?''

బావ మాటల్లోని నిజం గ్రహించింది రుక్కమ్మ.

''బావా! నిన్ను నేనవిగావలె, ఇవిగావాలె నని కోరుతున్నానా సెప్పు...? ఉన్నకాడికెల్ల దీసుకుందామంటన్న... నువ్విప్పుడు పోతెయాడాదొక్కదాన్నెట్లుండాలె సెప్పు...? ఒక్కరోజు నువ్వు కండ్లపడకుంటేనే మనసంతెట్లనో అయితది...'' అంది.

''నువ్వు నన్ను పైసకొరకు కట్టపడుతవని పోతన్ననా రుక్కూ నాకు మాత్తరం నిన్నిడిసి ఉండాలన్నుంటదా...? కని ఏంజెయ్యాలె... ఓ దిక్కు అప్పులుండె... సేతు లొక్క పైసన్నలేంది లగ్గం జేసుకుంటె ఒక్క సీరె కొనన్నాకట్టమేనాయె... యాడాదనంగ ఎంతల గడిసిపోతది...'' విషాదవదనుడైన మరదలు నోదార్చాడు... బుగ్గపై ముద్దుపెట్టుకున్నాడు.

బావ ముద్దు పెట్టుకున్న చోటోసారి తడిమి చూసుకుంది రుక్కమ్మ. కిష్టయ్య కళ్లనిండా నీళ్లతో, ముల్లెతో బస్సెక్కాడు.. కడుపెడు దు:ఖాన్ని కడుపులో దాచుకొని వదిలేస్తే తొణికే నీటికుండలావున్న కన్నీటితో బావకు వీడ్కోలు చెప్పింది రుక్కమ్మ. ఒకరి సమక్షంలో ఒకరికి దినాలు గడియల్లా గడిచిపోయిన రుక్కమ్మ, కిష్టయ్యలకు ముందున్న మున్నూటరవై అయిదు సుదీర్ఘ దినాలు కళ్లముందు కదలాడుతూ వాళ్లహృదయాలు భారమయ్యాయి.

ఎవరి నోటి నుంచి ఒక్కమాటకూడా పెగిలి బయటకు రాలేదు. ఎవరికివారే మౌనంగా

రోదిస్తూ వీడ్కోలు చెప్పుకున్నారు.

''బావా! నీ ఆరోగ్యం పాడుసేసుకోకు... కడుపునిండా తిను... అందరితోను కలిసిమెలిసి సుండు. బాగ ష్టసేసి అలిట్టాగాకు... కారటురాసుడు మరిసిపోకు.. పైలం...'' అని ఎన్నో మాటలు చెప్పాలనుకుంది రుక్కమ్మ.

''రుక్కూ! నువ్వు ధైర్యంగుండు. నాకోసరం రంది పెట్టుకోకు, యాడాదికాంగనే మా వత్త... అటెనుక లగ్గంజేసుకొని ఇక్కన్నే ఉందాం... పోతేపోదాం! నువ్వైతె ఏడుసుకుంటుండకూ...'' మరెన్నో మాటలు మరదలుతో చెప్పాలనుకున్నాడు కిష్టయ్య.

కాని ఎంత ప్రయత్నించినా ఇద్దరినోట నుండీ ఒక్కమాటకూడా బయటకు రాలేదు. వాళ్లనోట్లో మాటలు నోట్లో ఉండగానే కిష్టయ్యను రుక్కమ్మనుండి దూరంచేస్తూ దుమ్ములేపుతూ వెళ్లిపోయింది బస్సు. బస్సు కనుమరుగయ్యేంత వరకు చూసి ఇంటికొచ్చింది రుక్కమ్మ.

మరునాటి నుంచే రుక్కమ్మ బావకొరకెదురు చూడటం ప్రారంభించింది. బావ వస్తానన్న గడువయిపోయిన తర్వాత నిరీక్షణ మరీ ఎక్కువయింది. రోజులు గడుస్తున్న కొద్దీ బెంగ ఎక్కువవుతోంది. బావమీది బెంగతో సగమయింది. అంతకు ముందటి జాకెట్లన్నీ ఎవరివో అడుక్కొని తొడుక్కున్నట్లుగా ఒదులయ్యాయి. అన్నం సరిగా తినడంలేదు. ఏ పనిచేస్తున్నా బావధ్యాసే... రోజూ అత్తింటికి వస్తాడేమోనని ఎదురిచూడటం, రాకపోతే నిరాశపడటం ఆమె నిత్యకృత్యాలయ్యాయి...

★★★

దీర్ఘాలోచనలోపడి బావ జ్ఞాపకాలలో మునిగి పోయినరుక్కమ్మ ''ఏందేమొ- బాగాలోసిత్తన్నవు..? మీద సినికులు పడేటియిగూడా సోయిలేదానె...?'' అన్న తల్లిమాటలతో ఈ లోకం లోకొచ్చింది. చూరునీళ్లు తలపైనుండీ పడి జాకెట్టంతా తడిసింది. లేచి నిల్చుంది.. బయట వర్షం తగ్గింది... మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది... అంత్తింటికెళ్లింది...

అన్నం తిని మంచంలో పడుకున్న అత్తతో ''భీవండి నుంచి కాగటేమన్నచ్చిందా అత్త...'' అంది. కోడలు మాటలకు లోపల్లోపలే నవ్వుకొని ''ఐదాఱ్రోజుల కిందనే కారటచ్చిందని సెప్పితిగాదె...? మల్లగిప్పుడే అత్తదా...? నెలరోజులల్ల తప్పకత్తన్నడని సెప్పలే నీకు...?'' అంది రాజమ్మ.

అవును... అత్త ఇదివరకే చెప్పింది. అయినా బావగురించెన్ని సార్లడిగినా, ఎన్నిసార్లు చెప్పించుకున్నా తనకు మళ్లీ కొత్తే. బావ ఇంకో ఇరవై అయిదు రోజుల్లో వస్తాడు. వచ్చి తనముందు వాలతాడు, తాను బావ కళ్లబడకుండా ఏడ్పిస్తుంది. ఆలస్యం చేసిన బావను కొంతసేపైనా ఏడ్పించాలి, అటుతర్వాత పెళ్లవుతుంది. చెరోకూలి చేసుకొని ఇద్దరూ చిలుకా గోరింకల్లా ఉండొచ్చు. రుక్కమ్మ మనసు గాలిలో తేలియాడుతోంది. బావతో భవిష్యజ్జీవితాన్ని గూర్చి ఊహించుకుంటూ ఆనందంతో ''పోతన్నత్త'' అని రాజమ్మకు చెప్పి అరుగుదిగిన రుక్కమ్మ బస్సు దిగివస్తున్న మొండయ్యను చూసి అలాగే నిల్చుంది... ఇంతలో మొండయ్యక్కడకు సమీపించి చేతిలో వున్న సూటుకేసును కిందబెట్టి నిల్చున్నాడు, మొండయ్యను చూసి రాజమ్మకూడా బయటకొచ్చింది.

''భీవండినుంచే అత్తన్నవా బిడ్డ- అంత మంచిదేనా?'' ఆతురతగా అంది రుక్కమ్మ.

మొండయ్యముఖం రక్తహీనమై పాలిపోయినట్టుగా తయారయింది. రుక్కమ్మ ముఖంలో కిష్టయ్య గూర్చి కనిపిస్తున్న ఆతురత... బావకొరకెదురుచూపు అతన్ని మాట్లాడనివ్వడం లేదు.. ఆ వార్తనెలా

చెప్పాలో అదివిని రుక్కమ్మ ఎలా తట్టుకుంటుందో అతని కర్థం కావడంలేదు. తన నోటి నుంచి ఆ దుర్వార్త చెప్పవలసి వస్తున్నందుకు మధనపడుతున్నాడు.

మతరక్కసి మరోమారు తన విషకోరలు చాచిందనీ, ఐదారురోజులుగా జరుగుతున్న మతకలహాల్లో ఎంతోమంది మరణించారనీ, ఎన్నో ఆస్తులు కొల్లగొట్టబడ్డాయని, అమాయకుడైనకిష్టయ్య ఓ మతోన్మాది కత్తిపోటుకు గురయి ఈ లోకం విడిచిపోయాడనీ, రక్తపుమడుగులో కొట్టుకుంటున్న కిష్టయ్యను తను కళ్లారా చూశాననీ, చావగా మిగిలినవారు చెట్టుకొకరు పుట్టకొకరుగా పరుగెత్తుకొస్తున్నారనీ- వాళ్లకెలా చెప్పాలో తెలియక మొండయ్య సతమతమవుతున్నాడు. బావరాకకోసం మేఘం కొరకు ఎదురుచూసే చాతకపక్షిలా చూస్తున్న రుక్కమ్మకు బావ ఇక తిరిగిరాడని ఎలా చెప్పడం..? తలవంచుకొని మౌనంగా నిల్చున్నాడు మొండయ్య. '' ఏమైందే మొండన్న- ఎంజెప్పుతలేవు? బావెప్పుడత్తున్నడు...?'' అని దగ్గరికొచ్చి అడిగింది రుక్కమ్మ.

'' ఏంగాలేదు... ఏంగాలేదు...'' అని నీళ్లు మింగాడు మొండయ్య.

ఆ మాటలతో బావగురించి వార్తకోసం మరింత ఆతురత పెరిగింది రుక్కమ్మకు. '' ఏందే మొండన్నేమో దాయవడ్తివి. బావ మంచిగున్నడా?'' అంది రుక్కమ్మ. ''సెప్పులేవు బిడ్డ కిష్టన్నెప్పుడత్తనన్నడు...?'' అడిగింది రాజమ్మ.

ఎంత కఠోరవార్తయినా ఎన్ని రోజులని దాయడానికి వీలవుతుంది...? ఏదో ఒకరోజు తెలియక తప్పదు. తెలిసినప్పుడు అగ్నిపర్వతం బద్దలుకాకా తప్పదు... అనుకున్నాడు మొండయ్య.

కళ్లవెంబడి ధారాపాతంగా నీళ్లు కారుతుండగా మతకలహాల విషయం చెప్పి ''... కిష్టయ్య చచ్చిపెయిండు...'' అని బావురుమన్నాడు మొండయ్య. రాజమ్మ కాళ్లు, చేతులు, తల నేలకేసికొట్టుకుంటూ ''కొడకా... కొడుకా...'' అని భోరుభోరున ఏడ్వసాగింది.

రుక్కమ్మ గుండె చెరువుకాగా అవాక్కయి నిల్చుంది.

తన బావ.... చిన్నప్పట్నుంచి కలిసిమెలసి పెరిగిన బావ... తన గుండెలనిండా తానై ఉన్న బావ... చిలిపిపనులతో తననల్లరిపెట్టిన బావ... తన స్వప్నమయిన బావ... తన కొరకు దేశంగానిదేశంపోయి డబ్బు సంపాదించుకొస్తానని పోయిన బావ... తనమెళ్లో తాళికట్టవలసిన బావ... కిష్టయ్య బావ తనకిక లేడా...? ఎవరికొరకయితే కళ్లలో వత్తులేసుకొని ఏడాదిన్నరనుంచి రోజుకోయుగంగా గడుపుతూ ఎదురుచూస్తోందో... ఎవరి కౌగిట్లో కరిగిపోవాలని రోజూ కలలుగంటోందో... ఎవరినయితే తన సర్వస్వంగా పంచప్రాణాలకంటె ఎక్కువగా భావించిందో... అలాంటి బావ తనకిక లేడా...? భారమైన హృదయాలతో తీసుకున్న ఆనాటి మూగ వీడ్కోలే తమ చివరి వీడ్కోలా? తన చిరకాల నిరీక్షణ ఫలితమిదా...? ఏ బావ కొరకయితే... ఏ బావ స్పర్శకొరకయితే తన శరీరంలోని అణువణువు తపిస్తోందో ఆ శరీరాన్ని మరొకరికి...

ఒక్కక్షణంలో రుక్కమ్మలో అంతులేని ఆలోచనా పరంపర... ''బావా...'' అనిగావుకేకపెట్టి ''బావ చచ్చిపోలేదు... బావ చచ్చిపోలేదు..'' అని కేకలేస్తూ బస్సు స్టేజిదిక్కు పరుగెత్తసాగింది... పిచ్చిపట్టినదానిలా అరుస్తూ పరుగెత్తుతున్న రుక్కమ్మ వెంట గుమిగూడిన జనం పరుగెత్తసాగారు.. కొద్దిసేపట్లో ఆమెనందుకొని ఆపారు.

''నా బావేడి... నా బావేడి?'' అని కేకలు వేస్తూ అరుస్తోంది రుక్కమ్మ...

బావపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రుక్కమ్మకు మతిభ్రమించినది. రోజూ బస్సు దగ్గరికెళ్ళి ఆమె బావకొరకు చూస్తుంది. ఏళ్ళు గడిచినా, వెంట్రుకలు తెల్లబడుతున్నా ఆమె నిరీక్షణింకా కొనసాగుతూనే వుంది. ఆమె తన ముద్దులబావ రాకకొరకు తనదైనలోకంలో యుగయుగాలు నిరీక్షించడానికి సిద్ధంగా వుంది.

ఓ దిక్కు రుక్కమ్మ అలా నిరీక్షిస్తూనే వుంటే... నోటి దగ్గరికొచ్చిన బుక్కను గ్రద్ద తన్నుకుపోయినట్లు, కిష్టయ్యను కబళించి రుక్కమ్మ బతుకును అడవిగాచిన వెన్నెలజేసిన మతరక్కసిమాత్రం తన కంబంధహస్తాలను మరింత పొడవుచాచి ఇంకెన్నో జీవితాలను బుగ్గిచేస్తూనేవుంది.

విపుల జూలై 1988